విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 23, సెప్టెంబరు 2024

నియోజకవర్గ ప్రజలకు సాగు, తాగునీరు అందించాలి

మంత్రి నిమ్మల రామానాయుడుకు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర, నందికొట్కూరు : నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ శాశ్వత ప్రాతిపదికన కృష్ణాజిల్లాల సరిహద్దుల్లో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించాలని సిపిఐ జిల్లా నాయకులు రఘురాంమూర్తి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు స్థానిక ఎమ్మెల్యే జయసూర్యకు వినతిపత్రం ఇచ్చి కోరారు. ఆదివారం మల్యాల గ్రామంలో హంద్రీనీవా ఎత్తిపోతల పథకాన్ని సందర్శించడానికి వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడును మరియు ఎంఎల్ఏ గిత్త జయసూర్యలను సీపీఐ నాయకులు కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజక వర్గం రైతులు, ప్రజల త్యాగ ఫలితమే శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం వేలాది మంది నిర్వాసితులు త్యాగం చేసి, ఆంధ్ర రాష్ట్రానికి త్రాగు సాగునీరు అందిస్తున్నారన్నారు. అలాంటి రైతులకు నేడు సాగు త్రాగునీరు అందక మెట్ట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని అన్నారు. అధికారం లోకి వస్తున్న పాలక ప్రభుత్వాలు ఇక్కడ ఉన్న నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు తప్ప, ఈ ప్రాంత రైతాంగానికి నోట్లో మట్టి కొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో లక్షా 10 వేల ఎకరాలకు శాశ్వత ప్రాతిపదికన మా హక్కుగా ఉన్న కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గానికి నీరు అందించాలని, అదేవిధంగా 98 జీవో బాధితులు, గత 30 సంవత్సరాల నుండి ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్నవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బ్రాహ్మణకోట్కూరు గ్రామం మెట్ట భూములకు హంద్రీనీవా కాలువ ద్వారా మూడవ తూము కర్నూలు గుంటూరు రహదారి లో ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో దుప్పట్ల వాగు దగ్గర నూతన లిఫ్ట్ ఏర్పాటు చేయడం వల్ల వెయ్యి ఎకరాల మెట్టు భూములకు సాగునునీరు అందుతుందని ప్రభుత్వానికి గుర్తు చేశారు. మిడుతూరు మండలంలోని మెట్ట భూములకు సాగునీరు అందించడానికి నూతన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలని అలాగే మొక్కజొన్న పరిశ్రమను ఏర్పాటు చేయాలని ,నాగలూటి గ్రామంలో అపార నాపరాయి గనులు ఉన్నందువలన ఈ ప్రాంతంలో మైనింగ్ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా అలగనూరు రిజర్వాయర్ మరమ్మ త్తులు త్వరితగతిన పూర్తి చేసి నందికొట్కూరు పట్టణానికి త్రాగునీరు అందించాలని మంత్రిని కోరారు.

మంత్రిని కలిసిన వారిలో బ్రాహ్మణ కొట్టుకూరు మెట్ట భూముల సాగునీరు సాధన కమిటీ కన్వీనర్ మహమ్మద్ రఫీ ఏఐటియుసి నాయకులు మౌలాలి రాజు మద్దిలేటి తదితరులు ఉన్నారు.

అన్నదాత సుఖీభవ కింద డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయాలి

సీపీఐ నేతలు..

విశాలాంధ్ర-డోన్ : అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలో వెంటనే డబ్బులు జమ చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు మాట్లాడుతూ సంవత్సరం ఖరీఫ్ సీజన్ జోరందుకున్న వర్షాలతో ఖరీఫ్ సీజన్ ఊపందుకుందని,ఈ సమయంలో రైతులకు పంటలు వేసుకోవడానికి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనులకు, రైతన్నలకు పెట్టుబడి సాయంఖర్చుకి కీలకమన్నారు. సకాలంలో సాయం చేతికి వస్తేవారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలోమేము అధికారంలోకి వస్తే ఏటా ప్రతి రైతుకు 20 వేల రూపాయలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో అన్నదాత సుఖీభవ రైతులకుఎంతో ఉపయోగపడుతుం దని చెప్పారని, అయితే రైతులకు పెట్టుబడి సాయం ఊసే లేదని రైతులు ఆవేద వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి దాదాపుగా 4 నెలలుగా కావస్తున్న రైతుల ఆశలు రోజురోజుకీ ఆశలు ఆవిరిగా మిగులుతాయన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం రోజున రైతులకు పెట్టుబడి సాయం కింద మొట్టమొదటిగా ఐదు అంశాల మీద సంతకాలు పెట్టుబడి సాయం రైతులకు ఉంటుందన్నారు.క్యాబినెట్ సమావేశంలో ఈ అంశం పైన చర్చిస్తారని రైతులంతా ఆనంద వ్యక్తం చేశారని,ఈ అంశం పైన మంత్రివర్యులు అచ్చం నాయుడు అన్నదాత సుఖీభవ పథకం గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు.దీంతో రైతులు దళారుల దగ్గర ఆశ్రయించి అధిక వడ్డీలతోఅప్పులు చేస్తున్నారని, అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలకు జమ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోసీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సుంకయ్య,కె.రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

ప్రజలు కోరుకున్న కూటమి ప్రభుత్వం వచ్చింది...

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

విశాలాంధ్ర-నంద్యాల.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన "ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నంద్యాలలో ఆదివారం జరిగింది. నంద్యాల రెండో వార్డు చింతరుగు దగ్గర జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వినతి పత్రాల ద్వారా కొందరు తమ సమస్యలను విన్నవించగా, మరి కొందరు మా ఇబ్బందు లను తొలగించాలని అభ్యర్థించడంతో తక్షణమే పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ పట్ట ణాలు, గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న పరిస్థి తుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటిని బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తోందని చెప్పారు. వందరోజుల పాలన దిగ్విజయంగా ముగించు కుని అభివృద్ధివైపు ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే పనులను మాత్రమే ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో నం ద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఒకటో వార్డు టిడిపి కౌన్సిలర్ నాగార్జున, రెండో వార్డు టిడిపి ఇన్చార్జ్ జాకీర్, టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్, కొమ్ము హరి పాల్గొన్నారు.

విరాళాలు అందజేత

విశాలాంధ్ర-నంద్యాల .. నంద్యాల పరమేశ్వర హెూండా చైర్మన్ రాజశేఖర్ ఆధ్వర్యంలో రూ.లక్ష (పరమేశ్వర సర్వీస్ 50 వేలు పరమేశ్వర ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 50 వేలు) చెక్కును విజయవాడ వరద బాధితులకు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ లో వరదలు రావడం చాలా బాధాకరమైన విషయమని, చాలామంది ప్రజలు నిరుపేదలుగా మిగిలారని వారి కోసం తమ వంతు సహాయం సీఎం రిలీఫ్ ఫండ్‌కి అందజేస్తున్నామని తెలిపారు. నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు.

నంద్యాల కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సహాయం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు 36,616 రూపాయల చెక్కును విజయవాడ వరద బాధితులకు మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు అందజేశారు. అందరూ ఇలా ముందుకొచ్చి తమ వంతు సహాయ సహకారాలు వరద బాధితులకు అందించాలని పిలుపునిచ్చారు. నంద్యాల కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సర్దార్, సెక్రటరీ కరిముల్ల, ట్రెజరర్ ఇస్మాయిల్, షేక్ షా లక్ష్మి నారాయణ, నాగయా ఆచారి పాల్గొన్నారు.

ఎస్వీఆర్ ఆకాంక్ష విద్యార్థుల ప్రతిభ భేష్

విశాలాంధ్ర-నంద్యాల : జెయియి మెయిన్స్, అడ్వాన్స్‌లో అత్యధిక మార్కులు ర్యాంకులు సాధించిన నంద్యాల పట్టణ శివారులో గల ఎస్వీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఘనంగా సత్కరించారు ఇంతటి విజయానికి కృషిచేసిన కళాశాల చైర్మన్ శనివారపు కొండారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే భవిష్యత్తులో మరెన్నో మెడికల్, జేఈ మెయిన్స్, అడ్వాన్స్ సీట్లు సాధించి నంద్యాలకు దేశస్థాయిలో పేరు ప్రఖ్యాతలు తేవాలని విద్యార్థులను కోరారు. కాలేజీ యాజమాన్యం ఫరూక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమములో ఎస్.వి.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎస్ వెంకటరామిరెడి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి..

- 23న బ్లాక్ డే నిరసనకు సిద్ధం కండి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య

విశాలాంధ్ర-డోన్ : కేంద్ర ప్రభుత్వము తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ఏఐటియుసి జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన బ్లాక్ డే నిరసన చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఏఐటియుసి డోన్ కార్యదర్శి అబ్బాసులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో డోన్ నియోజకవర్గం సమావేశం పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పి.సుంకయ్య మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక సంక్షేమ చట్టాలను 4 లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక హక్కులను హరించడమే కాక, పెరిగిన ధరలు కనుగుణంగా కనీస వేతనం 26000 ఇవ్వాలన్నారు.అనేక సంవత్సరాల నుండి కార్మికులు ఎన్ని పోరాటాలు చేసిన పూర్తిగా నియంతృత్తో పోకడలకు పోవడం కార్మికుల హక్కుల అనిచివేసి కార్పొరేట్ సంస్థలకు మోకరిల్లడం అన్యాయమని ఆగ్రహ వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరించి, పెట్టుబడిదారులకు దారులకు కొమ్ముగాస్తు న్నారని దేశ సంపదను శ్రమజీవులు చెమటోడ్చి సంపద సృష్టిస్తే నరేంద్ర మోడీ అడ్డదిడ్డంగా కొల్లగొడుతున్నారని వారన్నారు. ఈనెల 23న సోమవారం ఏఐటీయూసీ కార్మిక శ్రేణులంతా మండల కేంద్రాల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బ్లాక్ డే నిరసన తెలియజేయా లని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జులేఖ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్వర్,డోన్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, హమాలి యూనియన్ నాయకులు భాస్కర్, కృష్ణ, వలి, దస్తగిరి, అయ్యన్న,శివారెడ్డి, బిల్డింగ్ ఆర్‌సిసి వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాకర్ నాయుడు, యాడికి రహిమాన్, పెయింటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు కుమార్‌లు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో స్తంభాలను సరిచేసి గ్రామస్తులను కాపాడండి

విశాలాంధ్ర - నంద్యాల

గోస్పాడు మండలం శ్రీనివాసపురం గ్రామం లో దాదాపు 20 స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారినా ప్రజల ప్రాణాలను పట్టించుకోని మండల విద్యుత్ అధికారికి ఎన్నిసార్లు సమస్య చెప్పినా ఫలితం లేదని, దీనికి బాధ్యతగా ఎఇని సస్పెండ్ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జి. హరినాథ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో గడప గడపకు ప్రోగ్రాంలో అప్పటి ఎమ్మెల్యే శిల్పా రవికిషోర్ రెడ్డి దృష్టికి తీసుకుపోయినా స్పందించి లేదని, అందుకే ప్రజలు చిత్తుగా ఓడించారని, వర్షాలు కురవడం వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ఒరిగిన స్తంభాలను సరిచేయాలని ఏఈకి చెప్పినా స్పందించలేదన్నారు. ప్రమాదకరంగా మారిన, ఒరిగిన స్తంభా లను, ఏ ప్రమాదము జరగకముందే వాటిని సరిచేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడా లని లేనిపక్షంలో సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఏఈపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని సిపిఐ మండల కార్యదర్శి జి.హరినాథ్, నాయకులు చంద్ర, సుబ్బ రాయుడు, గుర్రప్పలు తెలిపారు.

మోడీ శ్వేతపత్రం విడుదల చేయాలి

చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు

విశాలాంధ్ర, కర్నూలు.. సార్వత్రిక ఎన్నికలకు 6నెలల ముందుగా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభు విశ్వకర్మ యోజన పథకాన్ని 18 రకాల చేత వృత్తిదారుల కోసం ప్రవేశపెట్టిన" విశ్వకర్మ" యోజన పథకం కింద 20 లక్షల మంది పైగా వృద్ధి లబ్ది పొందారని, ఎనిమిది లక్షల మంది చేతి వృత్తిదారులు వృత్తి నైపుణ్య శిక్షణ పొందారని, ఈ పథకం సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఒక "పోస్టర్"ను విడుదల చేస్తూ చేసిన ప్రకటనపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలను వెల్లడించాలని, రాష్ట్రంలో కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలను వెల్లడించా లని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనే యులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ 10 సంవత్సరాల పాలనలో వృత్తిదారులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పైగా జాతీయ చేనేత బోర్డును రద్దుచేసి చేనేత రంగంపై జీఎస్టి పన్ను కూడా విధించి చేనేత రంగంపై పెనుభారం మోపిన ఫలితంగా చేనేత రంగం కుదేలై ఆ రంగం పైన ఆధారపడిన చేనేత కార్మికులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు చేసుకున్నారు. రెండుసార్లు కరోనా వచ్చిన సందర్భంగా చేతి వృత్తి దారులను, పేదలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి బడా కార్పొరేట్ వ్యాపారులకు రుణాలు మాఫీ చేసి పన్నుల రాయితీలు ఇచ్చి ప్రపంచ కుబేరులుగా ఎదిగేందుకు నరేంద్ర మోడీ 10 సంవత్సరాల పాలనంతా తోడ్పడిందన్నారు. ఇప్పటికైనా చేతి వృత్తిదారులను మభ్య పెట్టే ప్రకటనలు మానుకొని కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో చంద్రబాబుల డబలింజన్ ప్రభుత్వాలు చేతి వృత్తిదారులను ఆదుకునేందుకు చిత్తశుద్ధితో కృషిచేయాలని కోరారు.

80 బన్నూర్ గిరిజన కాలనీని సందర్శించిన ఆర్డీఓ

విశాలాంధ్ర జూపాడు బంగ్లా: మండలంలోని 80బన్నూర్ గ్రామంలో ఉన్న 40గిరిజన కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, పొలాలు స్మశానం కేటాయించాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్ బాబు ఇచ్చిన పిర్యాదు మేరకు స్పందించి ఆదివారం ఆత్మకూరు ఆర్డీఓ మిరియాల దాస్ 80 బన్నూరు గిరిజన కాలనీ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల నుండి అర సేంట్ స్థలంలోనే ఇళ్ళు నిర్మించుకొని ఒక్కో ఇంట్లో దాదాపు 3 కుటుంబాలు దుర్భర జీవనంతో గడుపుతున్నారని ఆర్డీఓకు తెలిపారు. కనీసం ఉండడానికి వారికి ఇల్లు కూడా సరిగ్గా లేవన్నారు. గిరిజనులకు స్మశానం, ఎకరా పొలం కూడా వారికి లేదన్నారు. తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనీ ఆర్డీఓకి తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు పుల్లన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంచి నడవడిక అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-శిరివెళ్ల : రౌడీషీటర్లు మంచి నడవడిక అలవర్చు కోవాలని ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ రవికుమార్ తెలియ జేశారు. మండల కేంద్రంలోని సబ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ ఆవరణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్న పీరయ్య అధ్యక్షతన ఆదివారం రౌడీషీటర్లకు ఆళ్లగడ్డ డి.ఎస్.పి కౌన్సిలింగ్ ఇచ్చారు. అత్యాధునిక టెక్నాలజీ గల సాంకేతిక నేర నిర్ధారణ పరికరాలు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయని ఎవరు తప్పు చేసినా తప్పించుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. ఘర్షణలకు దిగకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

వంద రోజుల్లో సంక్షేమ పథకాలతో సంక్షేమ పాలన

ఎమ్మెల్యే గిత్త జయసూర్య..

విశాలాంధ్ర-పాములపాడు :- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వందరోజులలో పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రంలో సుపరిపాలన అందించారని నందికొట్కూరు ఎమ్మె ల్యే గిత్త జయసూర్య అన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్ర మాన్ని పాములపాడు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథుగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రాష్ట్రం కష్టాల్లో ఉన్నప్పటికీ హామీలను నెరవేర్చే విధంగా ముందుకు సాగు తున్నారు అన్నారు, పెన్షన్లు 3000 ఉంటే రూ.4 వేల వరకు పెంచారని, ఆరు గ్యారెంటీలలో భాగంగా మొదటి సంతకం మెగా డీఎస్సీపై సంతకం చేశారని ,ప్రతినెల ఉద్యోగస్తులకు ఒకటో తారీకునే జీతాలు వేస్తున్నారని అన్నారు. పేదల కోసం అన్న క్యాంటీలను ఏర్పాటు చేశారన్నారు, ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు, విజయవాడలో వచ్చిన వరదను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన విజన్‌తో ప్రజానీకాన్ని ఆదుకున్నారన్నారు. గ్రామ పంచాయతీలకు 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరు అయ్యాయని అన్నారు ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ తాను సొంతంగా వరదల సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు, తెలంగాణకు చెరొక కోటి రూపాయలు అందజేశారని, వరదల్లో దెబ్బతిన్న 400 గ్రామ పంచాయతీలకు తన సొంతంగా ఒక్కొక్క గ్రామ పంచాయతీకి లక్ష చొప్పున నాలుగు కోట్ల రూపాయలు ఇచ్చి గ్రామాల అభివృద్ధికి తోడ్పడ్డాడని తెలిపారు.

ప్రజా సంఘాల నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, శ్రీలతలు గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసినప్పుడు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలన్నారు. అలాగే సిఐటియు నాయకులు సామ న్న, వెంకటేశ్వరరావు, మేకల రాజులు గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించా లని, అలాగే రజక సంఘం జిల్లా నాయకులు సివెంకటేశ్వర్లు రామకృష్ణ, ధర్మయ్యలు రజకులకు ధోబిఘాట్లకు సాకలి ఐలమ్మ విగ్రహానికి స్థలం కేటా యించి నిర్మించి ఇవ్వాలని, అంబేద్కర్ భవనానికి స్థలాన్ని చూపించాలని ఎమ్మా ర్పీఎస్ నాయకులు స్వాములు కోరారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించండి

- ఎస్టియు జిల్లా అధ్యక్షులు మౌలాలి

విశాలాంధ్ర-నంద్యాల : ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని ఎస్టియు నంద్యాల జిల్లా అధ్యక్షులు మౌలాలి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టియు నంద్యాల జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు మౌలాలి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా ఉపాధ్యా యులకు ఇంకా యాప్‌ల భారం తగ్గడం లేదని, దీనితో బోధనపై భారం పెరుగుతుందని, జిల్లాలో ఇంకా చాలా చోట్ల మరుగుదొడ్ల యాప్‌ల విని యోగం ఉపాధ్యాయులచే నిర్వహించేలా చేస్తున్నారని, ప్రభుత్వాలు ఎన్ని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అవి అమలు కావడం లేదని, ఈ విషయంలో జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్ర మంలో ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి ఈవి గోపాలకృష్ణ, నంద్యాల మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, మండల బాధ్యులు సోమయ్య, సీనియర్ నాయకులు మనోహర్‌రెడ్డి, ప్రభాకర్, మధుసూదన్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర, నందికొట్కూరు : నందికొట్కూరు నియోజ వర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఐ అనుబంధం ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పగిడాల రోడ్డు ఆవరణలో రైతులు మొక్కజొన్న పంటను ఆరబోసిన వాటిని ఏపీ రైతు సంఘం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంది కొట్కూరు నియోజకవర్గంలో రైతులు మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారన్నారని, అయితే ఇప్పటికే పంట కోయడం మొదలుపెట్టా రని కింటాలు మొక్కజొన్న రూ.2800 ఉన్న ధరఅక్టోబర్ మాసంలో రైతులందరికీ పంట చేతికి వచ్చే సమయంలో దళారులు కుమ్మక్కై ధరను తగ్గిస్తున్నారన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న రైతులను దృష్టిలో ఉంచుకొని దళారుల చేతిలో రైతులు మోసపోకుండా క్వింటాలు ధర రూ.4 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు మోసం చేయకుండా లైసెన్స్ ఉన్న వ్యాపారస్తులు వ్యాపారం చేసే విధంగా చూడాలన్నారు. రైతుల దగ్గర మొక్కజొన్నలు కొనుగోలు చేసి నెలలు గడిచిన డబ్బులు ఇవ్వక ఐపీలు పెట్టి రైతులకు మోసం చేస్తున్నారని అలాంటి వారి పైన కఠినచర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు వేల్పుల ఏసన్న కాటేపోవు సోమన్న, ఎంరామకృష్ణ ఎస్ ఖాదర్బాషా, రైతు మహిళా నాయకురాలు బీబీ, డి.సోమప్ప, ఏం లింగన్న ఎస్.అన్వర్ భాష పాల్గొన్నారు.

చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న జిల్లా జడ్జి

విశాలాంధ్ర, బనగానపల్లె : నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారిని కర్నూ లు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కపర్ది అమ్మవారిని దర్శించుకొని మొక్కు లు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆల య వేదపండితులు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

విశాలాంధ్ర, ప్యాపిలి : పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొమ్మేమర్రి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయినదని అధికారంలోకి రాగానే వృద్ధులకు పింఛను రూ.4 వేలు పెంచిందని, వికలాంగు లకు పింఛన్ రూ.6 వేలకు పెంచిన ఘనత మాకే దక్కిందన్నారు. డోన్ నియోజకవర్గంలో 40 గ్రామాలలో సెల్లు టవర్లులేవని వాటిని గుర్తించి వాటి పనులు త్వరలో పూర్తి అవుతాయని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాలలో పశువులు పెంచేవాళ్లు కరువయ్యారని ప్రతి రైతు ఆవులను, గొర్రెలను పెంచాలని సూచించారు. ప్రభుత్వం తరఫున గోకుల షెడ్డు అనే స్కీము ఉన్నదని దానిని ఉపయోగించుకోవాలన్నారు.

రైతులకు స్ప్రింకర్లు సబ్సిడీ కింద ఇవ్వలేదని మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు సబ్సిడీ తరఫున సింకర్లు ఇస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనం తరం రాచర్ల బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. హాస్టల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు సరిగా లేవని తక్షణమే దీనికి సంబంధించిన అధికారికి పది రోజుల లోపల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాపరెడ్డి, లక్కసాగరం లక్ష్మారెడ్డి, గండికోట సుబ్బయ్య, వెంకట్రాముడు, తాసిల్దార్ భారతి, ఎంపీడీవో ఫజల్ రెహమాన్, పిఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఆ అన్ని శాఖల అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - చాగలమర్రి : నిరు పేదల సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్య మని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్య క్షులు ఎంఎస్ అన్సర్ భాష అన్నారు. రాష్ట్రం లోని ప్రజలు సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆదివారం పీర్ గైబుసా వలి దర్గాలో ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ పథకా లను అందిస్తూ మంచి పేరు తెచ్చుకొని వారి మన్ననలు పొందు తుందన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాలనలో పార్టీలక తీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ నిరుపేదల హృదయాల్లో నిలిచారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి రూ వ2.5 కోట్లతో మారుమూల గ్రామాలలో సైతం అభివృద్ధి పనులు చేపడుతున్నా రన్నారు. చాగలమర్రి మండలాన్ని భూమా అఖిలప్రియ సహకారంతో నందన వనంగా తీర్చిదిద్దుతా మన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి మాబు షరీఫ్, మౌలాలి, ముల్లా అజీం, జెట్టి నాగరాజు, ముల్లా గఫార్, కొలిమి షబ్బీర్ పాల్గొన్నారు.

అవోపా ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణంలోని అవోపా కార్యాల యంలో ఆదివారం అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్, థైరాయిడ్, బీపీ వ్యాధుల మెగా వైద్య శిబి రాన్ని నిర్వహించారు. ఆళ్లగడ్డ కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం, డాక్టర్ సాయి ప్రణీష , మాక్లోడిస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు హాజరై రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందజేశారు. మెగా శిబిరానికి సుమారు 300 మందికి పైగా రోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ ఏవి రామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం జీవనశైలిలో లోటుపాట్ల వల్ల ఎక్కువగా లైఫ్ స్టైల్ డిసీజెస్ వస్తున్నాయని ప్రారంభంలోనే వాటిని కనుక్కొని సరైన చికిత్స చేయించుకోవడం ద్వారా రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసిన అవోపా, మహిళా విభాగ్ వారికి డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం, డాక్టర్ సాయి ప్రణీష కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ రామ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు అవోపా సంఘ భవన నిర్మాణ నిధికి 25,116/- ఆర్థిక సహాయం అందజేశారు. అవోపా సంఘ మహిళా విభాగ ప్రెసిడెంట్ సుజాత, సెక్రటరీ సునంద, కోశాధికారి కాత్యాయని పాల్గొన్నారు.

రామాంజనేయులు సేవలు మరువలేనివి

సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-ఆదోని: సీపీఐ మాజీ మండల కార్యదర్శి కీ.శే. కామ్రేడ్ కె.రామాంజనేయులు పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ ఆయన పార్టీ సభ్యుడుగా ఉంటూ ఇల్లు లేని నిరుపేదల కోసం భూపోరాటంలో భాగంగా సి.ఆర్.నగర్‌లో పెద్దఎత్తున భూపోరాటం చేసి పేదబడుగు బలహీన వర్గాల ప్రజలకు నివాస గృహాలు కల్పించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని, ఆయన చేసిన సేవలు మరువలేరని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య నగర్ కాలనీలో కీ.శే. రామాంజనేయులు నాలుగో వర్ధంతి కార్యక్రమం పట్టణ కార్యదర్శి సుదర్శన అధ్యక్షతన జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే నాయకులను కమ్యూనిస్టు పార్టీ ఏనాటికి మరువబోదని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వంద రోజులలోనే ప్రజలు నిరంతరం వినియోగిస్తున్న వస్తువులపై అధిక రేట్లు పెంచిందని, పెంచిన ధరలు తగ్గించకుండా మద్యం రేట్లు తగ్గించిందని పదేపదే ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. పెంచిన ధరలను తగ్గించాలని ఎన్నిసార్లు విన్నవించిన చెవిటి వాని ముందు శంకు ఊదినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అతి కష్టం మీద అధికారంలోకొచ్చి ఒకే దేశం ఒకే ఎన్నిక ఆచరణ సాధ్యం కానిదని, ప్రజాస్వామ్యానికి రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్రం నడుచుకుంటుందనీ, దీనికి సిపిఐ మద్దతు ఉండదని తేల్చి చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలలో జమిలి ఎన్నికలపై ఏనాడు ప్రస్తావించలేదని,ఎన్నికల అనంతరం ప్రజలను మభ్య పెట్టేందుకు ఇలాంటి ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్రంలో డబల్‌ఇంజన్ సర్కారొచ్చిన తర్వాత రాష్ట్రాభివృద్ధి చెందుతుందని ప్రజలు ఎంతో ఆశించినప్పటికీ వారి ఆశలు నీరుగారుస్తున్నారని, ప్రజలు తిరగబడితే గత ప్రభుత్వానికి ఏగతి పట్టిందో ప్రస్తుతప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. అంతకుముందు కీ.శే.కామ్రేడ్ రామాంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, జిల్లా సమితిసభ్యులు వీరేష్, ఏటీసీ పట్టణ కార్యదర్శి వెంకన్న, జిల్లా సమితి సభ్యుడు విజయ్, ఏకేస్ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు రంగన్న నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బసాపురం గోపాల్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఈరన్న గౌడ్, కొత్తూరు ఈరన్న, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు కోటమ్మ, మాణిక్యమ్మ, సరళమ్మ, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు వైట్ భీమేష్, సీపీఐ నాయకులు, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు అంజితగౌడ్, రమేష్, లింగప్ప, రాజు, కాలనీ వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ కమిషన్లు..దళారి వ్యవస్థను నిర్మూలించాలి-సీపీఐ

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అక్రమ కమిషన్లదందాను అరికట్టి, దళారీ వ్యవస్థను నిర్మూలించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం మార్కెట్‌యార్డులో పెద్దఎత్తున రాస్తారోకో చేపట్టారు.ఈ ధర్నా సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీయుల్లా అధ్యక్షత వహించారు.ఈధర్నాకు ముఖ్యఅతిథిగా సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్నరైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ పంట జిల్లా నుండే కాకుండా రాయచూరు,తెలంగాణ, అనంతపూర్ జిల్లాల నుండి పెద్దమొత్తంలో వేరుశనగ దిగుమతులు జరుగుతుందని, రైతులకు కడుపులో కొట్టడానికి రైతులకు తెలియకుండా వెంకట రాఘవేంద్ర ట్రేడర్స్,ఓం శ్రీ మణికంఠ శివ సాయి ట్రేడర్స్, అలిపీర ట్రేడర్స్,వీరితో పాటు మరో 13 దుకాణ కమిషన్ ఏజెంట్లు వేరుశనగ పంటను తీసుకొచ్చే వాహనాల డ్రైవర్లకు సంచికి రూ.10 నుండి 20లు కమిషన్ ఇస్తూ తమ దుకాణాలు ముందు వేరుశనగ ఉత్పత్తులు వేయాలని ఒప్పందం చేసుకోవడం జరుగుతుందని ఆరోపించారు. విక్రయించిన తర్వాత తక్ పట్టీ ద్వారా రైతులకు నూటికి రూ.2ల కమిషన్‌కి బదులు రూ.4లు పట్టుకోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క విక్రయాలకు ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారంనిర్వహిస్తున్న ఎల్.కె.టీ. రాముడు,దేవేంద్రలు దళారివ్యవస్థను నడుపుతూ వీరి వ్యాపారం మూడుపూవ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతూ రైతులు నుండి అక్రమ దందాను కొనసాగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యార్డులో ఈఏడాది రూ.600 కోట్ల విక్రయాలు జరుగుతున్నాయని,అక్రమంగా రైతులపై అదనంగా రూ.2 కోట్ల దోపిడి జరుగుతుందని, ఇంత పెద్ద ఎత్తున రైతులను దోపిడీ చేస్తున్న యార్డ్ అధికారులు దోపిడి వ్యవస్థను అరికట్టకుండా చోద్యం చూస్తున్నారనీ వారు తెలిపారు. ఇప్పటికైనా దోపిడీకి పాల్పడుతున్న కమిషన్ ఏజెంట్ల లైసెన్స్ రద్దు, అనాధికార విక్రయాలు,దళారీ వ్యవస్థ రద్దు, ఆ వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.తక్షణమే పత్తి కొనుగోలు చేపట్టి పత్తి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులు తీసుకొచ్చిన పంట ఉత్పత్తులకు రక్షణగా షెడ్లు ఏర్పాటు, మార్కెట్‌డేట్ అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్‌యార్డు కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు బిటి చిన్నాన్న, బిజీ విరూపాక్షి, బజారి, కె సి.జబ్బర్, మాలిక్, సమీవుల్లా, మల్లికార్జునగౌడ్, తిమ్మ గురుడు, వీరేష్,రామంజి, నరసింహులు, రవి, సుంకన్న,నరసప్ప, హనుమంతు, రాము, కాజా, కృష్ణ, వీరేష్, రాము, గోపాల్, ఇస్మాయిల్, మల్కన్నా గౌడ్, వెంకటేష్, మన్సూర్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కర్నూలు: ఈనెల 29న ప్రొద్దుటూరులో జరుగనున్న విద్యావంతుల వేదిక రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని విద్యా వంతుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు పిలుపు నిచ్చారు. ఆదివారం కర్నూలులోని ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.రత్నం ఏసేపు మాట్లాడుతూ రాయలసీమ విద్యావంతుల వేదిక ఏర్పడి 13ఏళ్లు పూర్తయ్యాయన్నారు. అందులో భాగంగా ఈనెల 29న ప్రొద్దుటూరులోని **'స్త్రీ శక్తి భవన్'**లో మహాసభలు జరుగనున్నాయి. **'విభజనానంతర ఆంధ్రప్రదేశ్..మన ముందున్న సవాళ్లు'** అనే అంశంపై రోజంతా సదస్సులు, మరియు బహిరంగ సభ జరుగనున్నాయి. ఈ మహా సభలకు వివిధ రంగాలలో పనిచేస్తున్న మేధావులు మాట్లాడతారని, రాష్ట్రం ఏర్పడి, పదేళ్లైనా ఏ మాత్రం అభివృద్ధి పనులు జరుగలేదు. విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను ఏ ప్రభుత్వం కూడా నెరవేర్చడం లేదు. ప్రభుత్వరంగ సంస్థలను, పరిశ్రమలను ఏర్పాటు చేయడం లేదు. రాయలసీమ లో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం లేదు. ఫలితంగా వలసలు ఎక్కువైపోతున్నాయి. ఈఅంశాలన్నిటిపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ను రూపొందించుకుంటామని తెలియజేస్తున్నాం. ఈ మహాసభల కు కర్నూల్ నుండి పెద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, విరసం బాధ్యులు పాణి, రైతుకూలీ సంఘం నాయకుడు సుంకన్న, జన విజ్ఞానవేదిక వేదిక కన్వీనర్ శేషాద్రి రెడ్డి, ప్రజా పరిరక్షణ వేదిక నాయకులు డేవిడ్, రవి, కుల నిర్మూలనా పోరాట సమితి బాధ్యులు సుబ్బారాయుడు, కళాకారులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నా క్యాంటీన్లను ప్రారంభించనున్న మంత్రి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : నగరంలో పునరుద్ధరించిన 2 అన్నాక్యాంటీన్లను సోమవారం రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖల మంత్రి టి.జి.భరత్ పునః ప్రారంభించనున్నారు. తొలుత ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని, అనంతరం కొండారెడ్డిబురుజు సమీపంలోని అన్నా క్యాంటిన్లను మంత్రితో పాటు జిల్లా కలెక్టరేట్ పి.రంజిత్ బాష, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. కాగా ఒక్కొక్క అన్న క్యాంటీన్‌ను నగరపాలక రూ.10 లక్షలు వెచ్చించి ఆధునీకరించిన సంగతి విదితమే.

ఏఐసీఎం సమావేశానికి మేయర్

మధ్యప్రదేశ్‌రాష్ట్రంలోని దివాస్ నగరంలో సోమవారం జరగనున్న అఖిల భారత మేయర్ల మండలి (ఏఐసిఎం) కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు మేయర్ బి.ఎల్లా రామయ్య ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఏఐసిఎం జాతీయ అధ్యక్షురాలు మాధురీ అతుల్‌పటేల్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో కార్యవర్గ సభ్యుడు హోదాలో మేయర్ పాల్గొనున్నారు. సమావేశంలో ఏఐసిఎం రాష్ట్రస్థాయి కమిటీల ఏర్పాటు, మేయర్లకు శిక్షణతరగతులు, కార్యాలయ పునరుద్ధరణ వంటి 9 అజెండాలతో పాటు పలు అంశాలపై చర్చించనున్నారు.

నేడు నగరపాలకలో వినతుల స్వీకరణ

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏవైనా స్థానిక సమస్యలుంటే అర్జీలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

పశుసంవర్ధకశాఖ సహాయకుల జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : జిల్లా పశుసంవర్ధక సహాయకుల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవోస్ హోమ్ నందు నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నెరియన్స్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకుల రాష్ట్ర అధ్యక్షులు పి.వి. రాజేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి డి.విజయ్ నాయక్, కోశాధికారి టి.మంజునాథన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ పశు సంవర్ధక సహాయకులు పశుసంవర్ధక శాఖకు సంబంధించిన పనులతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన పనులు చేస్తూ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ ఉత్తర్వుల మేరకు ఏహెచ్‌ఏలకు ఇతరశాఖలకు సంబంధించిన పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

ఏహెచ్‌ఏ జిల్లా అధ్యక్షురాలిగా పి.నాగవాసవి

ఏహెచ్‌ఏ జిల్లా అధ్యక్షురాలిగా పి.నాగవాసవి, కార్యదర్శి ఏ సురేష్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.వెంకటేష్, కోశాధికారిగా ఎం.భూపతి, ఉపాధ్యక్షులుగా జి.సురేష్ బాబు, యన్. సుశీల పి సంపత్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏ. శరత్, సంయుక్త కార్యదర్శిగా బి.శ్రావణి, పి శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల అధికారిగా జి.వెంకటేశ్వర్లు, అధనపు ఎన్నికల అధికారిగా పి.సుధాకర్ వ్యవహరించారు.

పరిపూర్ణ ప్రజాస్వామ్యవాది సీతారాం ఏచూరి-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: భారతదేశ రాజకీయాల్లో పరిపూర్ణ ప్రజాస్వామ్యవాది, పీడిత ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య,సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపాలు, సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమలింగప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్, మాజీ విద్యార్థి సంఘం నాయకులు అశోక్ కుమార్, అరుణ, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనందాచారిలు పేర్కొన్నారు.ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ సాయిబాబా దేవాలయ ఆవరణంలోని ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాంఏచూరి సంస్మరణ సభ సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నాయకుడు సీతారాం ఏచూరి అని, రాజకీయాలకు అతీతంగా సమస్యల ప్రతిపాదికన చట్టసభల్లోనూ, పార్లమెంట్ బయట అణగారిన వర్గాల ప్రజల కొరకు, రాజ్యాంగ పరిరక్షణకై కట్టుబడి పని చేశారని పేర్కొన్నారు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి దళిత, గిరిజన వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన వ్యక్తి సీతారాం ఏచూరి అన్నారు. వివిధ భావాలు, సిద్ధాంతాలున్న రాజకీయాల్లో అందరినీ కలుపుకొని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉమ్మడి పోరాటం చేశారని గుర్తు చేశారు.ఏచూరి విద్యార్థి దశలోనే జేఎన్టీయూ నాయకుడిగా ఇందిరా గాంధీని నిలదీసి వీసీ పదవికి రాజీనామా చేయించారన్నారు.తదనంతర రోజుల్లో ప్రజా నాయకుడిగా, తిరుగులేని నేతగా ఎదిగారని, దేశ పరిస్థితులు, సాంప్రదాయాలు అర్థం చేసుకొని దేశ ప్రజానీకానికి తగ్గట్టు చట్టాలు ఉండాలని పోరాడిన వ్యక్తి ఏచూరని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో 3 తరాల వ్యక్తులతో పనిచేసిన సీతారాం తన మేధస్సునంత ఉపయోగించి భారతదేశానికి విశేష సేవలు అందించారని, రైతాంగ,కార్మిక, విద్యార్థి, యువజన ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొని అనేక విజయాలు సాధించారన్నారు. వామపక్షాలు ఏచూరి ఆశయ సాధనకు ఉద్యమాలు చేపట్టినప్పుడే నిజమైన నివాళులని పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు,దస్తగిరి, వెంకటేష్ రెడ్డి, పెద్దహుల్తి సురేంద్ర, గోపాల్, సిద్దయ్య, కారన్న, రామాంజి, కాంతమ్మ, మధు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు ప్రాంత అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేద్దాం..!

ఏపీయూడబ్ల్యూజే సెమినార్‌లో-ఎంపి నాగరాజు, పత్తిపాడు ఎమ్మెల్యే రామంజినేయులు

విశాలాంధ్ర-ఆలూరు: ఆలూరు వెనుకబడిన ప్రాంతాభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేద్దామని ఎంపి నాగరాజు, పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఆలూరు టీడీపీ నేత వీరభద్రగౌడ్‌లు పిలుపునిచ్చారు.ఆదివారం ఆలూరు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆలూరు అభివృద్ధిలో మీడియా, ప్రజా ప్రతినిధులు, అధికారుల పాత్ర అనే అంశంపై ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు స్వరూప్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆలూరు ప్రాంతం వెనుకబడడానికి ప్రధాన కారణం నీటి వనరులేనన్నారు. ఆలూరు ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే వేదవతి, నగరడోన ప్రాజెక్టులు పూర్తి కావలసిన అవసరం ఉందన్నారు. ఈప్రాంతంలో వ్యవసాయం కోసం సాగునీరు లేకపోవడంతో పంటలు పండక గ్రామీణ ప్రాంత ప్రజలు పిల్ల పాపలతో ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సాగు నీటి వనరులు లేక పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆలూరు ఎమ్మెల్యేగా ఉన్న విరుపాక్షి, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంలతో కలసి ఆలూరు ప్రాంత సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏడాదిలోగా సమస్యలన్నీ పరిష్కరించేందుకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. చిప్పగిరి మండలంలో ఆలూరుబ్రాంచ్ కెనాల్ ఆధునీకరణకు కృషి చేస్తామని, హంద్రీనీవాకు తూము ఏర్పాటు కు ప్రయత్నిస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సారథ్యం లో వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిధులు రాబడతామని హామీ ఇచ్చారు. ఆలూరులో వ్యాపారంగంగా అభివృద్ధి చేసేందుకు పత్తి కొనుగోలు చేసే విధంగా కృషి చేస్తామన్నారు . నిలిచిపోయిన జాతీయ రహదారి పనులు పూర్తి చేసి తాగునీరు సమస్య పరిష్కారం కోసం సమ్మర్ స్టోరేజి ట్యాంకులు నిర్మాణం అయ్యేలా చూస్తామన్నారు. ఆలూరు పట్టణంలో నిర్మించిన రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఆరంభం అయ్యేలా చర్యలు తీకుంటున్నారు. రహదారులు బాగు చేస్తామన్నారు. ఆలూరు ప్రాంత సమస్యల పరిష్కారానికి ఆలూరు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. అనంతరం వేదవతి ప్రాజెక్టు నిర్మాణం, నగరడోణ ప్రాజెక్టు నిర్మాణం, హంద్రీ కాలువకు తూము ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. అనంతరం పార్టీలకు అతీతంగా అందరూ అభివాదం చేశారు.కార్యక్రమంలో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఐజెయూ నాయకులు గోరంట్ల కొండప్ప, నాగరాజు, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు గౌడ్, శ్రీనివాస గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్లు కురువ జయరాం, గుమ్మనూరు నారాయణ, మాజీ జడ్పీటిసి సభ్యులు మీనాక్షి నాయుడు, టీడీపీ నాయకులు వెంకటేష్ చౌదరి,నారాయణరెడ్డి, సీపీఐ నాయకులు భూపేష్, బిజెపి నాయకులు వెంకట రాముడు, హాలహార్వీ జడ్పీటీసీ సభ్యులు లింగప్ప, ఆలూరు, అస్పరి ఎంపీపీలు రంగమ్మ, ఉమదేవి, సీపీఐఎంఎల్ మునిస్వామి, న్యాయవాది వాయు జీవోత్తంరావ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు శ్రీధర్, నాగన్న, మహేష్,శివ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు సురేష్, చంద్ర బాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజేష్, ఆలూరు మండల అధ్యక్ష కార్యదర్శుల గోపాల్, వీరేష్, సీనియర్ నాయకులు వెంకన్న,అమీర్ సాబ్, పాల్గొన్నారు.

అనివార్య కారణాలతో రాలేకపోతున్నా...!

ఆలూరు అభివృద్ధిపై ఏపీడబ్ల్యూజేలో సెమినార్ నిర్వహిస్తున్నారు.ఇంత టి బృహత్తర కార్యక్రమానికి అనివార్యకారణాలతో రాలేకపోయానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ ఓ ప్రకటనలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్‌కు తెలిపారు. అనంతరం ఆ ప్రకటనలో ఈ నియో జకవర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యలు వేదవతి రిజర్వాయర్, నగరడోను ప్రాజెక్టు, నియోజవర్గంలో అన్ని గ్రామాలకు తాగునీరు,రోడ్ల సమస్యలపై సీఎం చంద్రబాబు కలసి ఆయన తెలియజేస్తానన్నారు.నియోజకవర్గాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

ప్రభుత్వ పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారు-మంత్రి టి.జి.భరత్

విశాలాంధ్ర-బ్యూరో-కర్నూలు: నూతన ప్రభుత్వ 100 రోజుల పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉదయం 47వ వార్డు ధర్మపేటలోని సచివాలయం వద్ద సాయంత్రం 13వ వార్డులోని బంగారుపేట శ్రీరామ టాకీస్ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన **'ఇది మంచి ప్రభుత్వం'** కార్యక్రమం లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేళ్లలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడి పోయిందన్నారు. సీఎం చంద్రబాబు విజనరీతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశలో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వంద రోజుల పాలనలో ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. మాట ఇచ్చిన విధంగా పెన్షన్ రూ.4 వేలు చేశామని, డీఎస్సీ విడుదల చేశామన్నారు. పేదల ఆకలి తీర్చే 175 అన్న క్యాంటీన్లను ప్రారంభించినట్లు తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించామని మంత్రి చెప్పారు.వరద బాధితులకు అండగా సీఎం కష్టపడ్డారన్నారు. 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలందరూ చెప్పేలా తమ పాలన ఉందన్నారు. ప్రజలకిచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ముందుకు వెళుతున్నామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. రానున్న ఐదేళ్లలో అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. కర్నూలు నగరంలోని సమస్యలను పరిష్కరించి నగర రూపురేఖలు మారుస్తానని చెప్పారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తెస్తామన్నారు.ఇక ఎంతో పవిత్రమైన తిరుమల లడ్డూ తయారీలో గతంలో కల్తీ జరగడం బాధాకరమన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం మంత్రి, అధికారులతో కలిసి వార్డు పర్యటన చేపట్టారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నాగేశ్వర్ యాదవ్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, స్థానిక నాయకులు, ఆరోగ్యధికారి విశ్వేశ్వర రెడ్డి, శానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు, టీపిఆర్ఓ వెంకటలక్ష్మి,మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, వార్డు కార్పొరేటర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కారించండి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : నగరంలో పలు వార్డుల్లో తిష్ట వేసిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్యశాఖల మంత్రి టిజి.భరత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం 13వ వార్డు బంగారు పేటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం అనంతరం కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, నగరపాలక అధికారులతో కలసి మంత్రి వార్డులో విస్తృతంగా పర్యటించారు. స్థానికులు తెలిపిన రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం, ప్యాచ్ వర్కులు, పారిశుద్ధ్య పనులకు సంబంధించి స్థానికులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి టిజి భరత్ నగర పాలక అధికారులకు ఆదేశించారు.

ఆ జీవోను తక్షణమే సవరణ చేయాలి-ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విద్యాశాఖలో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జీవో నెం.84ను వెంటనే సవరించి, మున్సిపల్ ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు బదిలీలు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి టి.కే జనార్ధన్లు, సీనియర్ నాయకులు డి.సుధీర్, ముదసిర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర్లులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం సలాం ఖాన్ ఎస్టీయూ భవనంలో సుధీర్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి జీవో 84 ను వెంటనే సవరణ చేయాలని, సర్వీస్ నిబంధనలు రూపొందించాలని, ఇతర అన్ని మేనేజ్ మెంట్ లలో జీవో నెంబర్ 117 ప్రకారం బదిలీలు, పదోన్నతులు చేపట్టారని, మున్సిపల్,కార్పొరేషన్ పరిధిలో కూడా 117కు అనుగుణంగా ఉన్నత పాఠశాలలో 3,4,5 తరగతుల విలీనం జరిపి మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేపట్టలేదని, విద్యార్థుల సంఖ్య పెరిగి ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉన్నందున వెంటనే మున్సిపల్, కార్పొరేషన్ పరిధిల్లో పదోన్నతులు బదిలీల ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ ఆలస్యమవుతున్నందున తక్షణమే 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 1998-08 ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, వారి పదవి విరమణ వయసును 62 కు పెంపు, కస్తూర్బా ఉపాధ్యాయులకు ఎంటిఎస్‌ను అమలు, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, పదో తరగతి ప్రశ్నాపత్రంలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీనియర్ దేవదాసు, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: వెనుకబడిన పత్తికొండ నియోజకవర్గాన్ని హంద్రీనీవాజలాలతో సస్యశ్యామలం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యేకేఈ శ్యాంబాబు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును కోరారు.ఆదివారం కర్నూలు రాష్ట్ర అతిథి గృహంలో జలవనరుల శాఖ మంత్రిని కలిశారు. కర్నూలు జిల్లాలోని అత్యంత వెనుకబడి ప్రాంతమని నిత్యం కరువు కాటకాలతో వెనుకబడ్డ నియోజకవర్గమన్నారు. హంద్రీనీవా జలాలతో సస్యశ్యామలం చేయాలని మంత్రిని కోరారు. పత్తికొండ నియోజకవర్గం పరిధిలో హంద్రీనీవా కాలువ 80 కిలోమీటర్లు మేరా పారుతోందని పత్తికొండ, వెల్దుర్తి, క్రిష్ణగిరి, మద్దికేర, తుగ్గలి మండలాలలో హంద్రీనీవా కాలువ నీటిని గ్రావిటీ ద్వారా రైతుల పొలాలకు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించామని వాటిని మంజూరు చేయాలని మంత్రిని కోరారు. వైసీపీ ప్రభుత్వంలోని 106 చెరువుల ప్రాజెక్టును మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి 70 శాతం పనులు పూర్తి చేస్తే పోయిన వైసీపీ ప్రభుత్వంలో మిగిలిన 30% పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పత్తికొండ నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీళ్లు ఇచ్చేందుకు నిధులు మంజూరు చేసి నియోజక వర్గం రైతులను ఆదుకోవాలని జిల్లా వనరుల శాఖ మంత్రిని కోరారు. అందుకు మంత్రి స్పందించి త్వరలోనే హంద్రీనీవా ద్వారా నియోజకవర్గం లోని చెరువులకు నీళ్లు నింపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారని శ్యాంబాబు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి-ఎమ్మెల్యే బొగ్గుల

విశాలాంధ్ర-సి.బెళగల్: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సి.బెళగల్‌కు ఎమ్మెల్యే రాగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం అనే స్టిక్కరు అంటించి నూరు రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి పనులు గురించి ప్రజలకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు.ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యేకి విరాళం అందజేత

విశాలాంధ్ర-గోనెగండ్ల: విజయవాడ వరద బాధితుల కోసం, కాంట్రాక్ట్ బలిజ ఈశ్వర్ విరాళాన్ని ఎమ్మెల్యే డా. బీవీ జయనాగేశ్వరరెడ్డికి శనివారం అందజేశారు.మండల పరిధిలోని కులుమాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విజయవాడ వరద బాధితులకు రూ.30వేలు చెక్కు ను ఎమ్మెల్యేకు అందజేశారు.

వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్పించాలి

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : వాల్మీకి బోయలను చేర్పించాలని..వాల్మీకుల ఐక్యత వర్ధిల్లాలి..ఆదివారం కర్నూల్లో బైక్ ర్యాలీ పాదయాత్రతో కర్నూలు జిల్లా పరిషత్‌కు చేరుకొని సమావేశభవనంలో వాల్మీకి బోయలను ఎస్టీ అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ చర్చ సమావేశాన్ని నిర్వహించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు అర్జున్‌లు మాట్లాడుతూ వాల్మీకులంతా ఐక్యమత్యంగా పోరాటాల ద్వారా సాధించుకుందామని పిలుపునిచ్చారు.

భవనాల చుట్టూ మురుగు..ఇబ్బందుల్లో కాలనీ ప్రజలు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: అధికారులు ఏ గ్రామానికి వెళ్లిన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి, ఇండ్ల చుట్టూ నీరు నిలువ లేకుండా జాగ్రత్తగా తీసుకోండని ప్రజలకు సూచనలు చేస్తూ ఉంటారు. వారు విధులు నిర్వహించే కార్యాలయ పరిసరాలను పట్టించుకోవడం మరిచిపోయారు. మండలంలోని మాయలూరు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంక్ గ్రామంలోని బీసీ కాలనీలో ఒకే ప్రదేశంలో గత ప్రభుత్వం కోటి రూపాయలు పైగా వ్యయం చేసి నిర్మించింది. వర్షం కురిసిన ప్రతిసారి ఈ కార్యాలయాల చుట్టూ మూడు అడుగుల లోతు నీరు నిలుస్తూ ఉంది. పిచ్చి మొక్కలు పెరిగి, చెత్త,చెదారం పెరిగిపోయి అద్వానంగా ఉంది. వర్షాలకు పరిసరాల్లో నీరు నిలిచి కుళ్ళు, దుర్గంధం వెదజల్లుతూ ఉంది. పాములు, విష పురుగులు సంచారం పెరిగిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ మురుగు నీరు గృహాల చుట్టూ ఉండడంతో జ్వరాల బారిన పడవలసి వస్తూ ఉంది. దోమలు విళయతాండవం చేస్తున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, అక్కడ నివాసం ఉన్న కాలనీవాసులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటిని బయటకు పంపించి కాలనీవాసులకు రోగాలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

దళిత కుటుంబాలను పరామర్శించిన విశ్రాంత అడిషనల్ డీజీపీ బాబురావు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంటలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి ఘటనపై శనివారం గ్లోబల్ ఇన్సాఫ్ మాదిగ సొసైటీ అధ్యక్షులు, విశ్రాంత అడిషనల్ డీజీపీ కూచిపూడి బాబూరావు గ్రామాన్ని సందర్శించి దళిత కుటుంబాలతో మాట్లాడారు. దాడికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత అడిషనల్ డీజీపీ బాబురావు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా దళిత మహిళ గోవిందమ్మను అగ్రవర్ణాలు ఇంటి వెళ్లి లాక్కొని వెళ్లి వివస్త్రను విద్యుత్ స్తంభానికి కట్టేసి దాడి చేయడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. కుమారుడు కులాంతర వివాహం చేసుకున్నాడనే కుట్రతో దళిత మహిళ గోవిందమ్మపై విచక్షణరహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గోవిందమ్మపై సామాజిక దాడిని జిల్లాలోని కలెక్టర్, డీఐజీ, ఎస్పీలతో కలిసి వివరిస్తామన్నారు. అలాగే రాష్ట్ర హోమ్ మంత్రిని, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించి, గోవిందమ్మకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. గోవిందమ్మకు న్యాయం జరుగకపోతే హైకోర్టులో పిల్ వేస్తామని స్పష్టం చేశారు. ఇక్కడి దళిత కుటుంబాలు సంయమనం పాటించాలని, గొడవలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అంతకు ముందు ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళ గోవిందమ్మను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గోవిందమ్మపై దాడిని సుమోటోగా స్వీకరించాలి

పెద్దకడబూరు గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన సమావేశంలో విశ్రాంత డీజీపీ కూచిపూడి బాబురావు మాట్లాడుతూ కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై జరిగిన దాడిని సుమోటోగా స్వీకరించి సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దాడికి బాధ్యులైన వారందరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. దాడి వెనుక ఉన్న వారందరికీ శిక్ష పడేవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు టీఎం రమేష్, సామాజిక ఉద్యమకారుడు పులగుర్త సురేష్, మైనారిటీ హక్కుల సాధన పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి నూర్ అమహ్మద్, విశ్రాంత డీఎస్పీ పాపరావు, సురేంద్ర నాథ్, దీవక్ గద్వాడ్, సతీష్ కుమార్, మారెప్ప, హరి ప్రసాద్, రవి కిషోర్, సుజ్ఞానమ్మ, ఆనందరాజు, ఎజ్రా శ్రీధర్, పాధర్ కోలా విజయ రాజు, రాహుల్, రవికుమార్, జేమ్స్, మల్లేష్, రాజు, సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు, ఆర్సీఎం ఫాదర్ సంజీవరావు, స్థానిక దళిత నాయకులు కోడిగుడ్ల ఏసేపు, విజయ్ కుమార్, ముక్కరన్న, అర్లప్ప, కొరవ సుందరం, శాంతిరాజు, సతీష్, యువరాజు, నరసన్న, ఆదాము, దేవదాసు, మేకల రాజు, రోగెన్న, ప్రసాద్, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం-టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కంబలదిన్నె, కల్లుకుంట గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కంబలదిన్నె గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇంచార్జీ లక్ష్మన్న, బిజెపి ఇంచార్జీ విష్ణు వర్ధన్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో చేసిన పనులు ప్రజలకు వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అవ్వా తాతలకు, నిరుద్యోగులకు, రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధికి పెద్దపీట వేస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ వైపు చంద్రబాబు అడుగులు వేయిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, ప్రత్యేక అధికారులు వెంకటేశ్వర్లు, మహేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, నాయకులు మల్లికార్జున, మీసేవ ఆంజనేయ, విజయ్ కుమార్, తలారి అంజి, మునెప్ప, భీమరాయుడు, తాయన్న, లక్ష్మన్న, నాగేంద్ర, నాగప్ప, దాసప్ప రెడ్డి, సంజీవయ్య, నర్సింహులు, బిజెపి నాయకులు పురుషోత్తం గౌడ్, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను శిక్షించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డిని శిక్షించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వంద రోజుల పాలనలో ఏమి అభివృద్ధి చేసిందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అడగడం విడ్డూరంగా ఉందన్నారు. వందరోజుల పాలనలో 3 వేలున్న పెన్షన్ 4 వేలు వికలాంగులకు 6 వేలు పెన్షన్ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉచిత ఇసుక ప్రవేశపెట్టామన్నారు. శిలాఫలకాలు పగలగొట్టే చరిత్ర మీరు నేర్పినదేనని, జొన్నగిరి చెరువు దగ్గర చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన పైలాన్ మీ వైసిపి నాయకులు ధ్వంసం చేయలేదా అని ప్రశ్నించారు. వందరోజుల పాలనలో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో మీరు ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలే చెబుతారన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉపయోగించి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన జగన్ ను జైల్లో పెట్టాలన్నారు. ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్ అక్రమాలు చేసి కోట్లాది రూపాయల సొమ్మును దోచుకున్నాడని మండిపడ్డారు. చివరికి వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బ తీశారని, ఇలాంటి వారిని ఉపేక్షించ కూడదన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పురుషోత్తం చౌదరి, మనోహర్ చౌదరి, విజయ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అమ్మో విద్యుత్తు నియంత్రికలు ...!

ట్రాన్సుఫార్మర్లకు రక్షణ గోడలు కరువు
దిమ్మెలతో సరిపెట్టిన విద్యుత్ శాఖ అధికారులు
జిల్లాధికారులు రాకపోకలు సాగిస్తున్న వైనం

విశాలాంధ్ర నంద్యాల-అర్బన్: నంద్యాల పట్టణంలో రహ దారి వెంట ఉన్న ట్రాన్స్ఫారాలను చూస్తేనే అమ్మో ట్రాన్స్ఫారాలంటూ బెంబేలెత్తిపోతున్నారు. వివరాల్లోకెళ్తే నంద్యాల పట్టణం కలెక్టర్ కార్యాలయం నుండి బొగ్గు లైను బైపాస్ రోడ్డు మీదుగా బొమ్మల సత్రం క్రాంతి నగర్ వరకు రహదారి పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫారాలకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ ట్రాన్స్ఫారం లను దిమ్మెలతో కట్టి రక్షణ గోడ(కంచె) ఏర్పాటు చేసి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దగ్గర కంకరతో ఉంచాలి. విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించిన కాంట్రాక్టర్లు కేవలం తమ స్వలాభం కోసంతూతూ మంత్రంగా దిమ్మలతో ఏర్పాటు చేసి కింద కంకరతో కప్పకుండా ఎలాంటి రక్షణ కూడా లేకుండా విద్యుత్ ట్రాన్స్ఫారంలను ఏర్పాటు చేసి వెళున్నారు. ఇందుకు ఉదాహరణ బొగ్గు లైను ప్రాంతంలో బైపాస్ రోడ్డు వెంట పేదలు ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు ట్రాన్స్ఫారాలను పేదల ఇళ్ల ఎదురుగా, ఇంటి పక్కన ఏర్పాటు చేశారు. ఈ రహదారి వెంట నిత్యం భారీ వాహనాలు వెళ్తుంటాయి, ప్రమాదవశత్తు వాహనాలు వెళ్లి రక్షణ గోడలు లేని ట్రాన్స్ఫార్మను ఢీకొంటే భారీ ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వారి ఇళ్లకు ఎదురుగానే ట్రాన్స్ఫారంలను పెట్టడం వల్ల ప్రమాదవశత్తు చిన్నపిల్లలు, వృద్ధులు వాటి దగ్గరికి వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ ట్రాన్స్ఫారంల చుట్టూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి పిచ్చి మొక్కలతో అల్లుకుపోయాయి. వర్షాకాలంలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులకు వెళితే ట్రాన్స్ఫారంల దగ్గర కంకర లేకపోతే నీరు నిల్వ ఉండి సిబ్బందికి ప్రమాదం జరిగే అవకాశం కలదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు మేల్కొని విద్యుత్ ట్రాన్స్ఫారంల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేసి వాటి చుట్టూ అల్లుకుపోయిన తీగలను తీసి వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ఏఈ వివరణ: ఈ విషయంపై డి3 పరిధిలోని ఏఈ రవికుమార్ ను ఫోన్ లో వివరణ అడుగగా రూ.33 లక్షల రూపాయలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని త్వరలో టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు. బొగ్గులైన్ ప్రాంత నివాసి జ్యోతి రాణి మాట్లాడుతూ మా ఇంటికి ఎదురుగానే ట్రాన్స్ఫారంను ఏర్పాటు చేయడంతో వర్షాకాలంలో చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని తెలిపారు. దీంతో మేము ప్రతిరోజు భయం భయంగా గడపాల్సి వస్తుందని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మెడిసిన్ పీజీలో అవుకు విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-అవుకు: అవుకు పట్టణానికి చెందిన మిరియాల హరి పవన్ మెడిసిన్ పీజీలో సీటు సాధించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. బనగానపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మిరియాల రత్నమయ్య, లక్ష్మీ సులోచన దంపతుల కుమారుడు మిరియాల హరి పవన్ మెడిసిన్ పీజీలో జనరల్ మెడిసిన్ సీటు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తల్లి దండ్రులు అన్నారు. బనగానపల్లిలోని నెహ్రూ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించిన హరిపవన్, విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశాడు. అనంతరము అనంతపురం మెడికల్‌కళాశాలలో ఎంబిబిఎస్ విద్యను పూర్తి చేశాడు. ఆగస్టులో జరిగిన మెడిసిన్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆలిండియా స్థాయిలో 1676, రాష్ట్రస్థాయిలో 68వ ర్యాంకు సాధించాడు. జనరల్ మెడిసిన్ పూర్తిచేసిన అనంతరము గుండె వైద్య నిపుణులుగా ప్రజలకు సేవ చేయాలని ఉందన్నారు. మెడిసిన్ పీజీలో సీటు సాధించిన హరి పవన్‌ను కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు అభినందించారు.

మెడిసిన్‌లో మురిసిన ఆణిముత్యం

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: మండల పరిధిలోని వెలగటూరుకు చెందిన చవ్వ శ్రీనివాసులు చవ్వ వెంకటసుబ్బమ్మల దంపతుల కుమారుడు చవ్వా శివ కుమార్ పేదింట పుట్టినప్పటికీ చదువులో అత్యుత్తమ మార్కులు సాధించి మెడిసిన్ సీటు సాధించడం గర్వించదగిన విషయమని గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ధనుంజయుడు శివకుమార్ అభినందించారు. ఆదివారం వెలగటూరులో శివకుమార్‌కు నిర్వహించిన అభినందన సభ సభలో ధనుంజయుడు పాల్గొని శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధనుంజయుడు మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతో చదివి నంద్యాలలో మెడిసిన్ సీటు సాధించిన శివకుమార్ పలువురికి ఆదర్శంగా నిలిచారని ఆయన అన్నారు. తిమ్మరాజు, తాతయ్య , వుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా ఖురానే హాఫిజ్ పూర్తి

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని నయిపేట్ మజీద్ దగ్గరున్న జామియా దారుస్సవుద్ మదరసలోని విద్యార్థులైన సైఫుద్దీన్ సన్నాఫ్ షఫివుల్లా, న్యామతుల్లా సన్నాఫ్ అబ్దుల్లా, రెహాన్ సన్నాఫ్ చాంద్‌బాష, అబ్దుల్లా సన్నాఫ్ సాహెబా విద్యార్థులు ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ను చూడకుండా కంఠస్థం చేయడం అయిన ఖురానే హఫీజ్ దిగ్విజయంగా పూర్తి చేసిన సందర్భంగా గురువులు విద్యార్థులను సన్మానించారు. మదరసలో మొత్తం 120 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ ఏడాదికి 6-10మంది విద్యార్థులు ఖురానే హాఫీజ్ అవుతున్నారని మదరసా గురువులు అన్నారు.

మద్యం బాటిల్ స్వాధీనం-వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల పరిధిలోని రేవనూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 15 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్సై భూపాలుడు తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు రేవనూరు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మద్యం బాటిల్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి గ్రామంలో దాడి చేయగా ఊరి చివరలో కంపచెట్ల మధ్య మద్యం బాటిల్లు విక్రయిస్తున్న రామిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి అదుపులోకి తీసుకుని అతని అరెస్టు చేసినట్లు ఎస్సై భూపాలుడు తెలిపారు.

ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలి

విశాలాంధ్ర బనగానపల్లె: పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో మొక్కల పెంపకం,సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని మిట్టపల్లె, కాపులపల్లె సర్పంచ్ యడమ కంటితులసి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాడు కాపులపల్లె గ్రామంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది. పరిసరాలు పరిశుభ్రత మొక్కల సంరక్షణ కోసం గ్రామ ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు పేర్కొన్నారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో వై విధ్య భరితంగా దసరా ఉత్సవాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రొద్దుటూరు తర్వాత ఆళ్లగడ్డ పట్టణంలో కూడా ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ నెల 3 వ తేది నుండి 13 వరకు పది రోజులపాటు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి శాలను రంగు రంగుల విద్యుత్తు దీపాలు, కటౌట్లచే ప్రత్యేకంగా అలంకరించి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులోని అంబూరుకు చెందిన సౌందర్య రాజన్ వారిచే ప్రతి నిత్యం అమ్మవారి నవరాత్రి అలంకరణలు, ఫ్లవర్ డెకరేషన్, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భక్తుల దర్శనార్థం క్యూలైన్లు, పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటాయన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక రోజులైన బిందే సేవ, తోటోత్సవము, దుర్గాష్టమి రోజున మహిషాసుర మర్దిని అలంకారం, దశమి పండుగ రాత్రి గ్రామోత్సవం.. శ్రీ వాసవాంబ ఊరేగింపు ఉత్సవం, వసంతోత్సవము, పాన్పు సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది అమ్మవారి శాల ఆవరణలో తెప్పోత్సవం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేద పండితులచే నవగ్రహ జపాలు, ప్రత్యేక పూజలు, చండీ హెూమము, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు తొమ్మంద్రు వినోద్ కుమార్, అమ్మవారి శాల కార్యనిర్వాహక అధ్యక్షులు టంగుటూరి ప్రసాదరావు, బైసాని రవి ప్రకాష్, ఉపాధ్యక్షులు గుండా నాగ ప్రదీప్, అల్వాల శివ చరణ్, ఉపాధ్యక్షులు పేరూరు విజయ్ కుమార్, నిచ్చెన మెట్ల రామయ్య, ప్రధాన కార్యదర్శి సూర్య గోవిందరాజులు, సహాయ కార్యదర్శులు పోలయ్య, లగిశెట్టి సుబ్రహ్మణ్యం, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, పువ్వాడ సురేంద్ర కుమార్, కోశాధికారి రేపాకుల శ్రీనివాసులు, పండుగ కమిటీ కార్యదర్శి నూకల ఉదయ్ కుమార్, కోశాధికారి బైసాని రవి ప్రకాష్, ఉప కోశాధికారి గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర-పెద్దకడబూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని కల్లుకుంటను ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబుతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు దళిత కాలనీలో బాధితురాలు గోవిందమ్మ ఇంటిని పరిశీలించారు. అనంతరం కొంత మంది బీసీ సామాజిక వర్గ పెద్దలతో మాట్లాడి శాంతియుతంగా మెలగాలని సూచించారు. ఈయన తహసీల్దార్ శ్రీనాథ్, సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్ రెడ్డి తదితరులున్నారు.

ఆదోనిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచండి

విశాలాంధ్ర-ఆదోని : ఉపాధ్యాయులు ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఆదోని సబ్ కలెక్టర్ మోర భరద్వాజ్ అన్నారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని పీఆర్టీయు రాష్ట్ర నాయకుడు నాగరాజ రెడ్డి తెలిపారు. ఆదివారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జన్మదిన సందర్భంగా వేద ఆశీర్వచనంతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పీఆర్టియు బృందం. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మీ సమస్యలు ఏమైనా ఉంటే వచ్చి నేరుగా నన్ను కలవచ్చు అని తెలియజేశారు. ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేసి ఆదోని డివిజన్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు నాయకులు ఎస్ఎం నటరాజు, సంగమేశ్వర స్వామి, ఆర్ వి రంగారెడ్డి, జి కేశవయ్య పాల్గొన్నారు.

దేవనకొండ సీఐగా వంశీనాథ్

విశాలాంధ్ర-దేవనకొండ : దేవనకొండ సీఐగా వంశీనాథ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఫాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా మన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు సిబ్బంది, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

సీఐని కలిసిన వెలమకూరు సర్పంచు భాస్కర్

బదిలీలల్లో భాగంగా దేవనకొండ సీఐగా వంశీనాథ్ ఆదివారం విధుల్లో చేరిన సందర్భంగా వేమకూరు గ్రామ సర్పంచు భాస్కర్, సీనియర్ టీడీపీ నాయకులు రంగన్న, ఫిల్డ్ అస్టెంట్ సురేష్, వెలమకూరు గ్రామ టీడీపీ నాయుకులు, యువత మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు.

శిథిలావస్థకు చేరిన వంతెన

ఆందోళన చెందుతున్న వాహనదారులు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండలంలోని కలవటాల గ్రామ సమీపంలో నెల్లూరు ముంబై రాష్ట్ర రహదారిలో ఎర్ర వాగు పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారింది. రెండు వరుసల రహదారిగా ఉన్న ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన ఇరువైపులా రక్షణ గోడ,సమీపంలో హెచ్చరిక బోర్డు లేకపోవడంతో పాటు వంతెన దిగువుగా ఉండి మలుపు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వంతెన మీద వర్షపు నీరు ప్రవహిస్తూ రాకపోకలకు అడ్డంకిగా మారుతున్నది. చాలా సంవత్సరాల కిందట నిర్మించిన వంతెన కావడంతో శిథిలావస్థకు కూడా చేరింది. గుత్తి తాడపత్రి కొలిమిగుండ్ల నుండి కలవటాల మీదుగా జమ్మలమడుగు కోవెలకుంట్ల పొద్దుటూరు తదితర పట్టణాలకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అంతేకాక కలవటాల, జమ్మలమడుగు సమీపంలోని చిన్న కోమెర్ల వద్ద భారీ సిమెంట్ పరిశ్రమలు ఉండడంతో భారీ వాహనాలు వెళ్తుండడంతో పాటు జమ్మలమడుగు నుండి తాడపత్రి కి ఆర్టీసీ బస్సులు తిరుగుతూ రహదారి రద్దీగా మారడంతో ప్రమాదాఘటన లు వంతెనపై చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.